

శుక్రవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 42.2°C	కనిష్ఠం : 24.0°C

రంజాన్ వేళలు



ఇఫ్తార్ :	శనివారం	సా : 6.36 గం..
సహర్ :	ఆదివారం	ఉ : 4.43 గం..

కొనలేం.. తినలేం..





- పండుగల వేళ ధరల మంటలు
- పెరుగుతున్న రేట్లతో సామాన్యుల విలవిల
- మామిడి, నూనె, కారం, వెల్లుల్లి మరింత ఘాటు
- ఇదే బాటలో డ్రైఫ్రూట్స్ సేమియా, ముడి సరుకులు

మహబూబాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : నూనె ప్యాకెట్ నుంచి మొదలు నిత్యావసర ధరలన్నీ ఆకాశాన్నంటుతుండడంతో ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు.. ఉగాది, రంజాన్ పండుగలు సామాన్య ప్రజానీకం సంతోషంగా జరుపుకోలేని పరిస్థితి కన్పిస్తోంది. పెరిగిన రేట్లు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిరుపేద, మధ్యతరగతి, ధనిక తారతమ్య బేధాలు లేకుండా ఉత్సాహంగా నిర్వహించుకునే పండుగల్లో ఉపయోగించే ముడి సరుకులు కొనాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. నిత్యావసరా ల్లో అతి కీలకమైన బియ్యం, అల్లం, వెల్లుల్లి, కూరగాయల ధరలు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఈ నెల 9న తెలుగు సంవత్సరాది ఉగాది జరుపుకుంటుండగా, 11న రంజాన్ పండుగ జరుపుకోనున్నారు. ఈ రెండు పండుగల వేళ ధరలు కొండెక్కడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

పండుగల వేళ.. ధరల మోత..

మార్కెట్‌లో కేజీ అల్లం రూ.200, వెల్లుల్లి ధర రూ.200 విక్రయిస్తుండగా, మెంతులు, అవాలు 100 గ్రాములకు రూ.120 చొప్పున లభిస్తోంది. మీడియం నూనె లీటర్ ప్యాకెట్ ధర రూ.100 ఉండగా, క్వాలిటీని బట్టి రూ.115 నుంచి రూ.120 వరకు మార్కెట్లో లభిస్తోంది. పామాయిల్ మాత్రం రూ.90కి లీటర్ ప్యాకెట్ విక్రయిస్తున్నారు. మిల్లు నుంచి పల్లీనూనె ధర కిలోకు రూ.240 వరకు లభిస్తోంది. సన్‌ఫ్లవర్ మిల్లు నూనె ధర రూ.400లకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా తెలుగు ప్రజల ఉగాది వెళ్లగానే మామిడి పచ్చళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆలస్యంగా మామిడిపూత రావడం, పచ్చడి కాయలకు ఇంకా పలు ప్రాంతాల్లో పిక్క ముదరకపోవడం తదితర కారణాలతో అడపదడపా వస్తున్న మామిడి ధర మండిపోతోంది. ఎర్రమిర్చి కారం ధర రూ.250 నుంచి రూ.300 వరకు లభిస్తోంది. ఇక పచ్చడికి ఉపయోగించే ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడ ంతో మధ్య తరగతి కుటుంబాలు పూర్వంలో కన్నా తక్కువ సామర్థ్యంలోనే పచ్చళ్లు పెట్టుకోవాలనుకుంటున్నారు. సామాన్య పేద ప్రజానీకం ఏ కూరలు లేకున్నా కనీసం పచ్చి పులుసుతోనైనా పూట నెట్టుకొచ్చే ఈ రోజుల్లో చింతపండు ధర కిలో రూ.120 చేరుకుని అందుబాటులో లేకుండా పోయింది.

రంజాన్ మాసం చివరాంకంలో..

దాదాపు నెలరోజుల పాటు ఉపవాసాల దీక్ష నిర్వహించే ముస్లీంల రంజాన్ మాసం పూర్తి కావొస్తోంది. ఆకాశన్నింటిన ధరలతో నిత్యం విరివిగా వినియోగించే పండ్లు, ఫలహారాలు, డ్రైఫ్రూట్స్, సేమియాల ధరలతో పేద ప్రజలు వాటికి కొంత దూరమయ్యారు. ఇవి సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. రంజాన్ అనగానే వివిధ రకాల పండ్లతో పాటు సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖుర్మా నోరూరిస్తుంది. కటిక పేద కుటుంబాలు సైతం అందుబాటులోని తియ్యటి వంటకం సేమియా పైనే ఆశలుపెంచుకుంటాయి. గత ఆరేళ్లుగా రేషన్ షాపుల్లో ఇచ్చే పంచదార ఎత్తేశారు. పూర్వంలో రంజాన్‌కు ముస్లీంల కోసం ప్రత్యేకంగా చెక్కర కోటా ఇచ్చేవారు. ఇది నాటి మాటగానే మిగిలిపోయింది. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎంత ఉన్నా.. కొనుక్కోక తప్పడం లేదు.



మండు టెండల్లో పండ్ల ధరల మంట..

ఉపవాసాల మాసం రంజాన్‌లో ఎక్కువగా తీసుకునే ఖర్జురా పండ్లతో పాటు వివిధ రకాల నోరూరించే పండ్ల ధరలు కొండెక్కాయి. మార్కెట్‌లో విరివిగా లభించే నెంబర్ వన్ రకం ఖర్జూర ధర కేజీ గతేడాది రూ.350 ఉండగా ప్రస్తుతం రూ.500కు పెరిగిపోయింది. కిమియా అరకేజీ బాక్స్ ధర రూ.250 ఉండగా రూ.320 పెరిగింది. రెగ్యులర్ ఖర్జూర ధర రూ.120కే కేజీ లభిస్తోంది. అరచేతిలో ఇమిడే చిన్నసైజు దానిమ్మపండు కేజీ రూ.100 లభిస్తోంది. యాపిల్ రూ.100కు నాలుగు నుంచి ఆరు వరకు ఇస్తున్నారు. చిన్న తెల్లద్రాక్ష కేజీ రూ.100, అరటి డజన్ రూ.60, జామపండ్లు కేజీ రూ.50కి, ఫైనాపిల్ చిన్న సైజ్ కాయకు రూ. 70 నుంచి రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. పసుపు రంగు ఖర్బూజ కిలో రూ.60 నుంచి రూ.70 వరకు, వాటర్‌లెమన్ ఖర్బుజ కిలో రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. అరటిపండ్లు డజన్ రూ.50 నుంచి 60కి, జామ కిలో రూ.50, బొప్పాయి కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య విక్రయిస్తున్నారు. ఫైనాపిల్ కాయ సైజును బట్టి రూ.50 నుంచి రూ.80, రూ.100కు విక్రయిస్తున్నారు.

హమ్మా.. సేమియా షీర్ ఖుర్మా...

రంజాన్ నెలరోజుల పాటు అతిప్రియంగా భుజించే సేమియా పాయసంగా పిలుచుకునే షీర్‌ఖూర్మాలో ముడి సరుకైన పిండితో చేసే సేమియాలు, డ్రైఫ్రూట్‌ల ధరలు పెరిగిపోయాయి. రోస్టెడ్ సేమియా కిలో రూ.150 విక్రయిస్తున్నారు. పెరిగిన రేట్లతో వైట్ సేమియా గతేడాది రూ.120 ఉండగా రూ.150కి పెరిగింది. అహ్మదాబాద్ సేమియా రూ.160 నుంచి రూ.180కి పెరిగింది. హాల్‌హల్ సేమియా రూ.180 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. పెనీ నెయ్యి సేమియా రూ.400లకు అమ్ముతున్నారు. పాలు లీటర్ ధర రూ.60 నుంచి రూ.70, ఇక పాయసంలో వేసే చిరంజి కిలో ధర గతేడాది 1800 ఉండగా ప్రస్తుతం రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. జీడిపప్పు రూ.800కు, బాదంపప్పు ధర రూ.700లకు విక్రయిస్తున్నారు. ఎండుఖర్జూర రూ.350 ఉండగా రూ.500కి విక్రయిస్తున్నారు. కిస్‌మిస్ ధర రూ.350 ఉండగా రూ.400కు విక్రయిస్తున్నారు. కర్బూజ గింజలు రూ.400 ఉండగా, రూ.700కి అమ్ముతున్నారు. ఎండు కొబ్బరి కిలో రూ.300, పంచదార కిలో రూ.45, నెయ్యి రూ.700నుంచి రూ.900 వరకు విక్రయిస్తున్నారు. దీంతో సేమియా పాయసం రుచి చూడకముందే ధరలతో పేదోళ్లకు చేదెక్కుతోంది.

ధరాభారంతో విక్రయాలు అంతంతే..

మహ్మద్ అబ్దుల్ రహీం, రంజాన్ స్పెషల్స్ దుకాణ వ్యాపారి, మానుకోట



పెరిగిపోతున్న ధరలతో విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. రంజాన్ ప్రత్యేక దుకాణాలకు ముడిసరుకులు, డ్రైఫ్రూట్స్‌ను హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ విక్రయాలు చేపడుతున్నాం. గత ఏడాది పండుగతో పోలిస్తే ఈ సారి పండగ మార్కెట్ ఇంకా ఆరంభం కాలేదు. లాభాల మాట అలా ఉంచితే తెచ్చిన సరుకులు అమ్ముడుపోతాయా.. లేదా అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.



నుక్కడ్ నాటక్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



ఓ విద్యార్థిని కూచిపూడి నృత్యం

విజ్ఞానం.. వినోదం..

- నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభం
- వసంతోత్సవ సంబురంతో సందడిగా క్యాంపస్
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర్ సుబుధి

వివరాలు 5లో..

తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ



గుండాలగడ్డతండాలో మంచినీటి బావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 5: ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్ మండలం గుండాలగడ్డతండా గ్రామ పంచాయితీ పరిదిలోని మంచినీటి బావిని శుక్రవారం పరిశీలించా రు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ మాట్లాడుతూ... జిల్లాలో ఎండకాలం దృష్ట్యా భూగర్భజలాలు అడుగంటి పోయిన నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ, మంచీనీటి బావుల నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించాలన్నారు. ఎక్కడైతే తాగునీరు ఇబ్బంది ఉందో అక్కడప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. రిపేరులో ఉన్న మిషన్ భగీరథ పైపులను వెంటనే రిపేరు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు స్పందన, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

నేడు మదనాపురానికి చినజీయర్‌స్వామి

- వేంకటేశ్వరాలయ ప్రతిష్ఠాపనోత్సవాలకు హాజరు



గూడూరు, ఏప్రిల్ 5 : గూడూరు మండలం మదనాపురంలో లింగాల సుధీర్‌రెడ్డి, రాధిక దంపతుల ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి గాను శనివారం త్రిదండి చినజీయర్‌స్వామి హాజరవుతున్నారు. ఈ మేరకు శుక్రవారం వ్యవస్థాపకులు సుధీర్ రెడ్డి, రాధిక దంపతులు మాట్లాడుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రవచనాలు, భక్తులకు ఆశీర్వాదం, అన్నదానం ఉంటాయని, ఐదు వేల మందికి అన్నదాన ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కేసముద్రం, ఏప్రిల్ 5 : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. కేసముద్రం స్టేషన్ మసీదులో శుక్రవారం రాత్రి నవ్‌జవాన్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే మురళీనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దస్రూ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, వెంకన్న, పరాంకుశం శ్రీహరి, ముస్లిం పెద్దలు మహ్మద్ అలీ, జానీ, రజాక్, అయూబ్‌ఖాన్, ఎండీ.తాజొద్దిన్, నవాజ్, ఎస్‌కె.హాషాం, రఫీఖాన్, రియాజ్, ముజ్జు పాల్గొన్నారు.



కేసముద్రం మసీదు ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

పట్టభద్రుల తుది ఓటరు జాబితా అందజేత

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 5: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు శుక్రవారం అందజేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. ఏనుమాముల మార్కెట్ యార్డు గోడౌన్‌లో ర్యాండమైజేషన్ పూర్తిచేసిన ఈవీఎంల కేటాయింపు సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తుది ఓటర్ జాబితాను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, ఉప తహసీల్దార్ రంజిత్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్ కుమార్, రాజేష్, లక్ష్మణ్, బాబురావు, భిక్షపతి పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



హనుమానాయక్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గుండె పోటుతో ప్రభు త్వ ఉపాధ్యాయుడు బానోతు హనుమానాయక్ (58) శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళ్లర్పిం చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. హను మానాయక్ బయ్యారం మండలం రాంచం ద్రాపురం కొత్తతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఇంటివద్దనే మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. నివాళ్లర్పించిన వారిలో సేవాలాల్‌సేన రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, గుగులోతు నంగులాల్. మోతీలాల్, బాలునాయక్, దేవి, గుగులోతు కిషన్‌నాయక్‌లు ఉన్నారు.

21 క్వింటాళ్ల బెల్లం, పటిక పట్టివేత

సీరోలు, ఏప్రిల్ 5 : సీరోలు మండలం ఉప్పరగూడెం సమీపంలోని ఓ చెట్లపొదలో అక్రమంగా నిల్వచేసిన నల్లబెల్లం. పటికను స్వాధీనం చేసుకున్నట్లు శుక్రవారం ఎస్సై విజయ్‌రామ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్-ఖమ్మం ప్రధానరహదారి ఉప్పరగూడెం సమీపంలోని చెట్ల పొదల్లో నిల్వ ఉంచారన్న పక్కా సమాచారంతో చేశామన్నారు. ఉప్పరగూడెం హట్యతండాకు చెందిన బానోత్ భద్రు, కురవి మండలం రేకులతండాకు చెందిన బానోత్ అశోక్‌లకు చెందిన 21 క్వింటాళ్ల నల్ల బెల్లం, రెండు క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ రామ్‌కుమార్ తెలిపారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన అధికారులు

మహదేవపూర్, ఏప్రి ల్ 5: కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు, పంప్ హౌస్‌లను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ) ఛైర్మన్ శివ్ నందన్‌కుమార్ బృందం శుక్రవారం పరిశీలించింది. మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజితోపాటు కన్నెపల్లి వద్ద నిర్మించిన లక్ష్మీ పంప్‌హౌస్, అన్నా రం వద్ద నిర్మించిన సరస్వతీ బ్యారేజిలను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ఉదయం బయలుదేరిన ఛైర్మన్ బృందం బ్యారేజీలు, పంప్‌హౌస్‌లన్నింటిని పరిశీలించారు. మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్లు, లక్ష్మీ పంప్‌హౌస్‌లో రిపేర్లకు గురైన మోటార్లు, సరస్వతీ బ్యారేజి వద్ద బుంగలు పడిన ప్రాంతాన్ని జీఆర్ఎంబీ బృందం పరిశీలించింది. శని, ఆదివారాల్లో కూడా పర్యటించనుంది.

దేశంలో నిరుద్యోగం పెరుగుతోంది..

- ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయి
- రాష్ట్ర హైకోర్టు రిటైర్డు చీఫ్ జస్టిస్ చంద్రకుమార్
- కేయూలో ఘనంగా బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలు


మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : దేశంలో నిరుద్యోగం తీవ్రస్థాయిలో పెరుగుతోందని రిటైర్డు హైకోర్టు జడ్జీ జస్టిస్ బి.చంద్రకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం హనుమకొండ కేయూలో బాబు జగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఎస్డీఎల్‌సీఈ సమీపంలోని బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి చంద్రకుమార్‌తోపాటు కేయూ వీసీ రమేశ్ ఇతర అధికారులు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ రాజమణి అధ్యక్షతన ఏర్పాటు జయంతిని నిర్వహించారు. ఇందులో భాగంగా 'కాంటెంపరరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియన్ సొసైటీ' అనే అంశంపై జస్టిస్ బి.చంద్రకుమార్ హాజరై కీలక ప్రసంగం చేశారు. దేశంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యువత, విద్యార్థులలో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని చెప్పారు. జీవన సౌకర్యాలకు, ప్రమాణాలకు స్థూల, దేశీయ ఉత్పత్తి, తలసరి ఆదాయ గణాంకలలో పొంతనలేదన్నారు. దేశంలో పేదరికం ఎక్కువవుతోందన్నారు. రూ.80 లక్షల కోట్లనల్లధనం ఉందన్నరని, కొద్దిమంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతం అవుతోందని చెప్పారు. ప్రాజెక్టు అంచనాలను పెంచి ప్రజల సొమ్మును దోచుకుకుంటున్నారని చెప్పారు.

ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ గొప్ప మార్గదర్శి, సమతాస్ఫూర్తి బాబు జగ్జీవన్‌రాం ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంతో యువత ముందుండాలని చెప్పారు. విద్యతోనే మార్పు సాధ్యమన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ గొప్ప విలువలున్న మానవతామూర్తి జగ్జీవన్‌రాం అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన తుమ్మల రాజమణి మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రాంను ఆదర్శంగా తీసుకుని, యువత ఎదగాలని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశా కాంట్రాక్టు అధ్యాపకురాలు లక్ష్మి సభకు స్వాగతం పలుకగా, పీఆర్వో వల్లాల పృథ్వీరాజ్ వందన సమర్పణ చేశారు. చరిత్రఅండ్ టూరిజం ఫ్యాకల్టీ చిలువేరు రాజ్‌కుమార్ జస్టిస్ చంద్రకుమార్‌ను సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ప్రొఫెసర్ కె.వాసుదేవారెడ్డి, దూరవిద్య కేంద్రం ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొట్టే భాస్కర్, పాలమాకుల కొమురయ్య, బైరపాక ప్రశాంత్, పెండ్లి అశోక్‌బాబు, సుదయ్య, శ్రీధర్‌కుమార్ లోథ్, ప్రణయ్‌కుమార్, వెంకటేశ్, మాచర్ల ఐలేశ్, వంగాల సుధాకర్ పాల్గొన్నారు.


మూసివేసిన పాత బస్‌స్టేషన్

కొత్త బస్టాండ్ పనులు షురూ

- వరంగల్‌ల్ ఆర్టీసీ పాత భవనాల కూల్చివేత

గిర్మాజిపేట, ఏప్రిల్ 5 : నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు సేవలు అందించిన వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఇక కనుమరుగు కానుంది. మొండిగోడలు, పరిశుభ్రంలేని టాయిలెట్లు, ప్రయాణికులకు భద్రతలేని శిథిలావస్థకు చేరుకున్న బస్‌స్టేషన్ స్థానంలో అధునాతన మల్టీలెవెల్ బస్‌స్టేషన్ నిర్మాణానికి పనులు శుక్రవారం నుంచి పనులు మొదలయ్యాయి. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా నాటి ప్రధాని దివంగత పీవీ నరసింహరావు 1986 డిజెంబరు 21న అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టిరామారావు ప్రారంభించారు. సిటీ, జిల్లా బస్‌స్టేషన్‌లతో కూడిన ఈ బస్‌స్టేషన్ నుంచి నిత్యం 600 ఆర్టీసీ బస్సుల్లో సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా గత ప్రభు త్వం రూ.75కోట్ల 'కుడా' నిధులతో నూతన బస్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. గత జూన్ 17న అప్పటి మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మం త్రి కేటీఆర్ శిలాఫలకం వేయగా, ఎన్నికల షెడ్యూల్ విడుదలకు కొద్దిగంటల ముందు అప్పటి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అక్టోబరు 9న పనులు ప్రారంభించారు. తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడం, ఈ ఏడాది జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో బస్‌స్టేషన్ నిర్మా ణం పనులు మొదలు కాలేదు. తాజాగా దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖల మంత్రి కొండా సురేఖ నిర్మాణ పనులు మొదలు పెట్టాలని చెప్పడంతో 'కుడా' అధికారులు పనులు తిరిగి ప్రారంభించారు. ఏడు అంతస్థుల్లో అధునాతన బస్‌స్టేషన్‌లో 32 బస్ ప్లాట్‌ఫారాలు, మల్టీప్లెక్స్, రెస్టారెంటు,కమర్షియల్ కాంప్లెక్‌లు నిర్మించనున్నారు.

రాకపోకల నిలిపివేత..

కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం శుక్రవారం అధికారులు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా బస్టాండ్ మీదుగా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఎస్ఎన్ఎం క్లబ్‌కు ఎదురుగా రైల్వే ప్రహరికి ఆనుకుని తాత్కాలిక బస్‌స్టేషన్ నుంచి ప్రస్తుతం బస్‌ల రాకపోకలు యథాతథంగా సాగనున్నాయి. శుక్రవారం పాత బస్‌స్టేషన్‌ను పూర్తిగా మూసివేశారు. లోనికి ఎవరూ వెళ్లకుండా పెద్దతాళ్లు కట్టారు. ఖాళీ చేసిన గదుల నుంచి ఇనుప సామగ్రి, డోర్లు, కిటికీలు, పైపుల తొలగింపును ముమ్మరం చేశారు. ఎక్స్‌కవేటర్‌తో ట్యాక్సీ స్టాండ్ ప్రాంతంలో గోతులు తీస్తున్నారు.


మూసివేసిన బస్‌స్టేషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు



ప్రతిజ్ఞ చేపిస్తున్న ప్రొఫెసర్లు

సాంకేతిక వైద్యవిద్య వైపుగా పరుగు పెట్టాలి

- ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్
- కేఎంసీలో ఘనంగా పట్టాల ప్రధానోత్సవం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 5 : కాకతీయ మెడికల్ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వవిద్యార్థులు ప్రస్తుతం మన దేశంలోనే కాకుండా, విదేశాల్లోనూ ఉన్నత వైద్యులుగా రాణిస్తున్నారని కేఎంసీ పూర్వవిద్యార్థి, ప్రముఖ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్ తెలిపారు. అలాగే సాం కేతిక వైద్యవిద్య వైపుగా పరుగులు పెట్టాలని సూచించారు. శుక్రవారం కేఎంసీ కళాశాల మైదాన ప్రాంగణంలో వైద్యవిద్యను పూర్తి చేసిన విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో మానవత్వాన్ని విస్మరించవద్దని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టాల ప్రధానోత్సవ కార్యక్రమంలో కళాశాల మైదానంలో కోలాహాలం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు వేడుకల్లో పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో వైద్యవిద్యను పూర్తి చేసుకుని పట్టాలు అందుకున్న నేపథ్యంలో విద్యార్థులు వారి బంధువులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.



కుటుంబసభ్యులతో పట్టా అందుకున్న ఆనందాన్ని పంచుకుంటున్న వైద్య విద్యార్థి

గైనిక్‌లో పీజీ చేస్తా

- డాక్టర్ సాయిశ్రీభవ్య

తల్లిదండ్రులు, సోదరుడి సహకారంతో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఎమ్మెస్ గైనిక్ పూర్తి చేయాలని ఉంది. వైద్యవృత్తిలో పేదలకు సేవ అందించాలని ఉంది. తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేరుస్తా. పట్టా పొందడం ఆనందంగా ఉంది. అమ్మానాన్న కళ్లల్లో ఆనందం నాకు కనిపించింది.



మేళా ఈవెంట్‌లో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



కరౌకీ ఈవెంట్‌లో పాటలు పాడుతున్న విద్యార్థులు



కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజ్ఞానం.. వినోదం..

నిట్‌లో కన్నుల పండువగా స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభం

- వసంతోత్సవ సంబురంతో సందడిగా క్యాంపస్
- మొదలైన వివిధ ఈవెంట్లు.. ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- మూడు రోజులపాటు పలు సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆకట్టుకున్న చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్

హనుమకొండ (ఆంధ్రజ్యోతి)/ వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 : విజ్ఞానం, వినోదం కలగలిసిన స్ప్రింగ్ స్ప్రీ-2024 (వసంతోత్సవం) వేడుకలతో కాజీపేటలోని నిట్‌లో కోలాహలం నెలకొంది. శుక్రవారం ప్రారంభమైన ఈ వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన విద్యార్థులతో క్యాంపస్ సందడిగా మారింది. ప్రతి ఏటా ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో వరంగల్ నిట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 40 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 10 వేలమంది విద్యార్థులు పాల్గొంటున్నారు. విద్యార్థులకు ప్రతిభకు సానబట్టడంతో పాటు వారిలో దాగిఉన్న శక్తి సామర్థ్యాలు, సృజనాత్మకతను తట్టిలేపే 50కిపైగా ఈవెంట్లను ఇక్కడ నిర్వహిస్తున్నారు. గతంలో కన్నా ఈసారి సరికొత్తవి ప్రవేశపెట్టారు. విజ్ఞానం, వినోదం కలగలిసిన ఈ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచే ఈవెంట్లు ప్రారంభమయ్యాయి. తొలిరోజు 17 ఈవెంట్లను నిర్వహించారు. ఉదయం నుంచే విద్యార్థులు నిట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం వరకే అయిదువేల మందికిపైగా విద్యార్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. శని, ఆదివారాల్లో కూడా రెండురోజులు రిజిస్ట్రేషన్లు జరిగి మూడు రోజుల్లో మొత్తంగా పదివేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు స్ప్రింగ్ స్ప్రీ నిర్వాహకులు తెలిపారు. రాత్రి నిట్ స్టేడియంలో నిర్వహించిన కొరియోనైట్ పాప్‌షో విద్యార్థులను ఉర్రూతలూగించింది. మ్యూజిక్ అనుగుణంగా విద్యార్థులు చిందులేశారు. చౌరస్తా, హరిచరణ్ బ్యాండ్ షోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబరం

నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ సాంస్కృతిక సంబరాలు అంబరాన్నంటాయి. శుక్రవారం మొదటిరోజే టెక్నోక్రాట్స్ అద్భుతమైన ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. నిత్యం సాంకేతిక రంగంతో కుస్తీ పడుతున్న భావి భారత ఇంజనీర్లు వారిలోని సృజనాత్మక సాంస్కృతికతను బహిష్కృతం చేస్తున్నారు. సాంస్కృతికానికి సాంకేతికతను అద్దుతూ ఉత్సాహవంతమైన ఈవెంట్లను ప్రదర్శించారు. కాగా, నిట్‌లో స్ప్రింగ్ స్ప్రీ-2024ను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి అట్టహాసంగా ప్రారంభించారు. ఆరంభషో అదిరింది.

ఆకట్టుకున్న ఈవెంట్లు..

- నిట్‌లోని ఏక్ భారత్ శ్రేష్ఠ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహూతలను అలరించింది. ప్రముఖ కూచిపూడి నర్తకి తాడూరి రేణుక తన శిష్య బృందంతో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.
- యూత్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో వివిధ రకాలైన క్రీడలు నిర్వహిస్తారు. ఆసక్తిగల వారు మేళాలో నిర్వహించే అన్ని రకాల క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి. వారి ప్రతిభ ఆధారంగా వారికి పాయింట్లు ఇస్తారు. అలాగే స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమంలో భాగంగా నిట్ యానిమీ అండ్ కామిక్ క్లబ్ ఆధ్వర్యంలో యానిమీ షోలు ప్రదర్శించారు.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నుక్కడ్ నాటక్ అనే ప్రత్యేక నృత్య ప్రదర్శన ఆలోచింపజేసింది. సమాజంలో జరుగుతున్న వివిధ రకాల రుగ్మతల పట్ల సమాజం స్పందించాల్సిన తీరును కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన విద్యార్థులు ఆహూతుల ప్రసంశలు అందుకున్నారు.
- అన్ సాల్వ్‌డ్ పేరుతో నిట్‌లోని లిటరసీ అండ్ డిబేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట గమ్మత్తుగా ఉండటంతోపాటు థ్రిల్లర్ సినిమాను తలపించింది. అనేక రకాల ప్రశ్నల నుంచి ఆరుగురు అనుమానితుల నుంచి అంశం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి హంతకులను గుర్తించడం ఈ ఆటలో ప్రధాన అంశం.
- ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ అఫైర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇట్ వరంగల్ గాట్ టాలెంటెడ్ కార్యక్రమం అద్భుతంగా సాగింది. సుమారు 100 మంది విద్యార్థులు ఈ షోలో పాల్గొని వారి కళలను ప్రదర్శించి వీక్షకుల ప్రశంసలు పొందారు. అలాగే మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానలహరి కరౌకే టెక్నోక్రాట్‌లకు కిర్రాక్ లేపింది. ఆసక్తి ఉన్న వారు తమ గాత్రాన్ని పరిచయం చేసుకుని శ్రోతలను మెప్పించాల్సి ఉంటుంది.
- ఆరోహన్ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరంలో డ్రామా కాంపిటేషన్‌తో పాటు డ్రామా యాక్షన్ సన్నివేశాలను ఆవిష్కరించారు. వేషాలు, వేషధారణలు లేకుండా విద్యార్థులు వివిధ రకాల పాత్రలను పండించారు. విషాదాలు, విచిత్రాలు, హాస్యాలు, హాహాకారాలు ఇలా అనేక రకాలైన పాత్రలను విద్యార్థులు అవలీలగా పోషించారు.
- ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాఫిక్ డిజైన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఛాయ్ బిస్కెట్ సినిమా ఎడిటర్ డ్రాంప్ కిరణ్ పాల్గొని విద్యార్థులకు మెళకువలు నేర్పించారు. అనంతరం ఫిల్మ్ క్విజ్ నిర్వహించారు.
- డ్యాన్స్ అండ్ డ్రమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రీల్‌రీల్ రెవ్లట్‌లో ఆన్‌లైన్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఆసక్తి గల విద్యార్థులు పాల్గొని వారు చేసిన రీల్స్‌ను ఆన్‌లైన్‌లోనే ప్రదర్శించారు.
- ఫుడ్ హంట్ ఆహుతుల నోరూరించింది. నిట్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు వారి ప్రాంతాలకు చెందిన శాఖాహార, మాంసాహార ప్రత్యేక పదార్థాలను ప్రదర్శించారు.



సంస్కృతి, సాంకేతికత సమ్మిళితంతో సరికొత్త ఆవిష్కరణలు

వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి

సంస్కృతి, సాంకేతికత సమ్మేళితంతోనే సరికొత్త సృజన ఆవిష్కృతమవుతుందని వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాదర్ సుబుధి అన్నారు. శుక్రవారం స్ప్రింగ్ స్ప్రీ వేడుకలను నిట్ ఆడిటోరియంలో జరిగిన ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన సంస్కృతి, సాంకేతికత ఈ రెండు వేర్వేరు అయినా వీటి మధ్య అంతఃసూత్రం ఉందన్నారు. నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు మానసికోల్లాసానికి, తమలోని సృజనకు పదునుపెట్టడానికి ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో తరుచూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసాచార్య, స్టూడెంట్ ఆక్టివిటీ కౌన్సిల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ, నిట్ కల్చలర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.సంతోష్ బెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



దుమ్మురేపిన ప్రోషో..

వసంతోత్సవంలో మొదటి రోజు ప్రోషో దుమ్మురేపింది. ప్రముఖ గాయకుడు హరిచరణ్ బ్యాండ్ షోతో విద్యార్థుల్లో ఉత్సాహన్ని నింపారు. హరిచరణ్ పాటలు పాడుతున్నంత సేపు స్టేడియం మొత్తం కోలాహలంగా మారింది. అనంతరం మరో ప్రముఖ సింగర్ శిరిష తన గానంతో భావి భారత ఇంజనీర్లను సంభ్రమాశ్చర్యాల్లో ముంచి తేల్చారు. చౌరస్తా బ్యాండ్ షోతో టెక్నోక్రాట్స్ ఉర్రూతలూగారు. ఇద్దరు గాయకులు పాటలు పాడుతున్నంత సేపు స్టేడియంలో పూనకాలు లోడయ్యాయి. చరణ్, శిరీష వారి తాజా హిట్లలోని కొన్ని పాటలను పాడి వసంతోత్సవంలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆద్యంతం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ - జ్యోష్నారాణి సుబుద్ధి దంపతులు పాలుపంచుకున్నారు.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు ఇవే..

రెండోరోజైన శనివారం.. సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్ క్విజ్, హంగ్ గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలు జరగనున్నాయి.

శ్రీహరిని కలిసిన కార్పొరేటర్లు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 5 : స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావ్యకు అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆవాల రాధికరెడ్డి, సిరంగి సునీల్‌కుమార్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, జన్ను శిభిరాణి అనిల్, ఈదురు అరుణ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ ఫలితాల విడుదల

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 5 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సులమొదటి, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం వీసీ రమేశ్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ వొకేషనల్ తదితర కోర్సుల ఫలితాలను వెల్లడించారు. మొదటి సెమిస్టర్‌లో 24.41 శాతం ఉత్తీర్ణత సాధించగా, మూడో సెమిస్టర్‌లో 30 శాతం, ఐదో సెమిస్టర్‌లో 44.45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ https://kakatiya.a c.in/లో సంప్రదించాలని కోరారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి చాడ రాధికారెడ్డి, క్యాంపు ఆఫీసర్ ఆసీం ఇక్బాల్, నాయకపు .సమ్మయ్య పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి

- జిల్లా వ్యాప్తంగా జయంతి కార్యక్రమాలు
- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధు, ప్రజాసంఘాల నాయకులు


జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళలర్పిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


విగ్రహం వద్ద నివాళలర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్‌లో బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


తొర్రూరు మండలం వెలికట్టె శివారులో బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


తొర్రూరు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 5 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా దివంగత భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు వేర్వేరుగా విగ్రహాల వద్దకు వెళ్లి నివాళులర్పించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, ఎం. డేవిడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు బాలరాజు, రామారావు, ఎర్రయ్య, సురేష్, రామకృష్ణ, అంబరీష, మానుకోట ఆర్డీవో అలివేలు, మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

● మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళీనాయక్ పట్టణంలోని బాబు బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.కాంగ్రెస్ నాయకులు ఎడ్ల రమేష్, కోడి శ్రీను, భూక్య శ్రీను, మీసాల సురేష్, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, నాజర్ పాల్గొన్నారు.

● తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వివిధపార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ ఉపప్రధానిగా బాబు జగ్జీవనరామ్ అనేక సేవలందించారని పలువురు కొనియడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు అధ్యక్షతన ఈ కార్యక్రమంలో ఘనపురపు అంజయ్య, బొడ్డుపల్లి ఉపేంద్రం, కొండపల్లి రాంచందర్‌రావు, తప్పెట్ల వీరన్న, షైన శ్రీనివాస్, పట్టాభి లక్ష్మయ్య, గుగులోతు కిషన్‌నాయక్, పార్నంది రామయ్య, జానీ, బండారు వెంకట రమణ, గుగులోతు వెంకట్‌నాయక్, ఇనుగుర్తి సుధాకర్, మందుల రఘు, మంద శశి, దేవుడు పాల్గొన్నారు. మునిసిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సూర్నపు సోమయ్య భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● సీపీఐ, డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బి. విజయ సారథి, నర్రా శ్రావణ్, చిరంజీవి, కూరాకుల పాల్, రవి. రాజు పాల్గొన్నారు.

●పట్టణంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీసర్పంచ్‌బోడ లక్ష్మణ్‌నాయక్, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దర్శనం రామకృష్ణ, మోహన్‌నాయక్, దర్శనం నరేంద్ర శంకర్, తప్పెట్ల చాణక్యబాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● టీపీటీఎఫ్ వేడుకల్లో షైన శ్రీనివాస్, చుంచు శ్రీశైలం, చీకటి ఉపేందర్, ప్రకాశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

వివిధ మండలాలల్లో...

●తొర్రూరు మండలం వెలకట్టె గ్రామ శివారులో బాబు జగ్జీవన్‌రాం విగ్రహానికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జడ్పీటీసీ మంగలంపల్లి శ్రీనివాస్, గుండాల నర్సయ్య, సోమారపు ఐలయ్య, రాయిశెట్టి ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, సాయిమల్లు, ఉపాధ్యాయ సంఘం నాయకులు కిషన్ నాయక్, ఐలయ్య పాల్గొన్నారు.

● దంతాలపల్లి మండల కేంద్రంతో పాటు దాట్ల గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ రవీందర్, యాకన్న పాల్గొన్నారు.

●తొర్రూరు డివిజన్‌కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. టీపీసీసీ మాజీ సభ్యులు కె.నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజశేఖర్, సోమన్న, భిక్షం, రమేష్, యాకయ్య, సంతోష్ పాల్గొన్నారు. ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు.

● గార్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్, రాము, వెంకటేశ్వర్లు, వెంకన్న పాల్గొన్నారు. సీపీఎం పార్టీ కార్యాలయంలో బాబుజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, వంగూరి వెంకటేశ్వర్లు, అంబటి వీరస్వామి, కృష్ణ, శ్రీను, భిక్షం పాల్గొన్నారు.

●నెల్లికుదురు మండలకేంద్రంలో జరిగిన వేడుకల్లో ఇసంపెల్లి సైదులు, బాబుగౌడ్, అశోదభాస్కర్, తిలక్, వెంకన్న పాల్గొన్నారు.

●డోర్నకల్‌లో బాబుజగ్జీవన్‌రాం జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, పర్కాల సెకండ్‌క్లాస్ న్యాయాధికారి కొప్పుల శంకర్, వార్డు కౌన్సిలర్లు చంద్రశేఖర్, అశోక్, జనార్ధన్, సంధ్యారాణి, దళిత సంఘాల నాయకుడు పుట్టల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. యూపీఎస్ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరగిన వేడుకల్లో తలారి విద్యాసాగర్, ప్రభుదాస్, వెంపటి సీతారాములు పాల్గొన్నారు.

●గూడూరు మండల కేంద్రంలో ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో చంద్రమోహనస్వామి, సూపరిండెంట్ కరన్‌సింగ్, ఏపీవో బస్సీలాల్, రాజేంద్రప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

● ఇనుగుర్తి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు పప్పుల వెంకన్న, పెద్ద వెంకన్న, చంద్రయ్య, బాబురావు, శ్రీనివాస్, కట్టయ్య, భాస్కర్, సలీం, రజనీకాంత్, ప్రభాకర్, రాము, యాకయ్య పాల్గొన్నారు.

●కేసముద్రంలో అంబేద్కర్‌యువజనసంఘం మండల అధ్యక్షుడు వల్లందాసు రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణమూర్తి, సంజీవ,ఏలియా, శ్రీను, యాకస్వామి, మదార్, శంకర్ పాల్గొన్నారు.

● నర్సింహులపేట తహసీల్ ఆఫీసులో జరిగిన వేడుకల్లో నయాబ్ తహసీల్దార్ సంజీవరావు, సిబ్బంది పాల్గొన్నారు.


డోర్నకల్‌లో బాబుజగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న తదితరులు

పతకాలు సాధించిన పోలీసులకు సన్మానం


కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ, హెచ్‌సీలను సన్మానిస్తున్న సీఐ సర్వయ్య

కేసముద్రం, ఏప్రిల్ 5 : కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏఎస్ఐ కృష్ణమూర్తి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్ ఇటీవలె రాష్ట్రస్థాయి పోలీసు శాఖ ఉత్కృష్ట పతకాలు సాధించిన సందర్భంగా శుక్రవారం వారిని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య సన్మానించారు. ఎస్ఐ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 5 : ఎన్నికల కాంగ్రెస్ ఇచ్చిన హామిలను తక్షణమే అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. మహబూబాబాదద్‌లోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పినట్లుగా దానిని అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతుబంధు రూ.15 వేలు, కౌలు రైతులు రూ.12 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికి ఒక్క రైతుకు కూడ ఇవ్వలేదని ధ్వజమెత్తారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీకి 400 ఎంపీ స్థానాలు రావడంతో పాటు మూడోసారి ప్రధానిగా మోదీ అధికారం లోకి వస్తారని చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, మోసంగి మురళీ, దార ఇందుభారతి, బుల్లెట్ కృష్ణ, పైండ్ల శ్రీనివాస్, ఓర్సు పద్మావతి, రేష్మ, మారగాని రాజుగౌడ్, రాజేష్, నరేష్, లూనావత్ హుస్సేన్‌నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వద్దిరాజు రాంచందర్‌రావు

వేంకటేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న రాంమోహన్‌రెడ్డి

గూడూరు, ఏప్రిల్ 5 :గూడూరు మండలం మదనాపురంలో రూ.1.5కోట్లతో లింగాల సుధీరెడ్డి, రాధిక దంపతుల ఆధ్వర్యంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని శుక్రవారం ప్రముఖులు, నాయకులు సందర్శించారు. మహబూబాబాద్ మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, గూడూరు మాజీ జడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి, జలగం కిషన్‌రావు, మాజీ సర్పంచ్ రణధీర్‌రెడ్డి సందర్శించారు.

బలరాంనాయక్ గెలవడం ఖాయం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

మరిపెడ, ఏప్రిల్ 5 : మానుకోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో గెలువడం ఖాయ మని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నా రు. శుక్రవారం ఆయన మరిపెడలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సమావేశంలో శేర్‌లింగంపల్లి మాజీ ఎమ్మెల్యే శంకర్‌గౌడ్, బీమానాయక్, అంబరీశ, రాంలాల్, తాజుద్దీన్, అప్సర్, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు అవసరమైన మందులనే ఇవ్వాలి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 5:ఫర్టిలైజర్ డీలర్లు పంటలకు అవసరమైన మందులను మాత్రమే ఇవ్వాలని దేశి ప్రోగ్రాం స్పెసిలిటర్ రాంచద్రరావు, ఉద్యానవనశాఖ అధికారి రాకేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖానాపురంలో రైతు అశోక్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో చీడపీడల నివారణకు ఉపయోగించే ముందలపై డీలర్లకు అవగాహన కలిపించి మాట్లాడారు. డీలర్లు నారాయణరావు, సురేష్, యాకన్న పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి కోసం డిజిటల్ ప్రచారం


గార్లలో డిజిటల్ ప్రచార దృశ్యం

గార్ల ఎప్రిల్ 5 :మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ విజయాన్ని చేకుర్చాలని కోరుతూ అపార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గార్ల మండల కేంద్రంలోని పలు విధుల్లో ముమ్మరంగా డిజిటల్ ప్రచారం నిర్వహించారు.. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు జంపాల శ్రీను మాట్లాడారు. అజ్మీరా రామునాయక్, తోడేటి నాగరాజు, జశ్వంత్ ఠాకుర్, దేవా నాయక్ పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు పెద్దఎత్తున తరలాలి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 5: తుక్కుగూడలో ఈ నెల 6న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన బహిరంగ సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..రాష్టరంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో .కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత నిచ్చారని చెప్పారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తుల పక్షాన నిలిచిందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నారోజు సత్యమనోరమ, స్వర్ణలత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ

మూడు తరాల తెలంగాణ ఉద్యమం పాట చిత్రీకరణ

మానుకోట, కంబాలపల్లి, బయ్యారంలో షూటింగ్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 5: నాటి తెలంగాణ రైతాంగ పోరాట యోధుల స్ఫూర్తి నేటి వరకు జరిగిన మూడు తరాల తెలంగాణ ఉద్యమంపై మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి స్వయంగా పాట రాసి దానిని చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాటం, 1969 నాటి తెలంగాణ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమం మూడు తరాల ఉద్యమంపై పాటను రాసి నిర్మాతగా ఆ పాటను చిత్రీకరిస్తున్నారు. గత మూడు రోజులుగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కంబాలపల్లి, బయ్యారం ప్రాంతాల్లో కళాకారులతో షూటింగ్ నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహబూబాబాద్ వీరభవన్ వద్ద పాటను చిత్రీకరిం చారు. ఈ సందర్భంగా పాట రచయిత, నిర్మాత బి. అజయ్‌సారధిరెడ్డి మాట్లాడుతూ.. మూడు తరాల ఉద్యమ చరిత్ర, ఉద్యమకా రుల స్ఫూర్తి, వారి త్యాగాలు పాటలో పొందుపర్చి ఆ చరిత్ర కనుమరుగు కాకుండా పదిలంగా ఉండేలా భవిష్యత్ తరాలకు తెలియజేసేందుకు పాటను రూపొందిస్తున్నట్లు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారథిరెడ్డి, కొరియాగ్రాఫర్ కందుకూరి అనిల్ , కళాకారులు బండ వెంకన్న, కట్లోజు పాండురంగాచారి, కేదాసు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో కళాకారులతో మూడు తరాల తెలంగాణ ఉద్యమంపై పాట రాసిన అజయ్‌సారథిరెడ్డి

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

తొర్రూరు, ఏప్రిల్ 5 : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వెంటనే రైతు రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ చేపట్టే రైతు మహా ధర్నాను విజయవంతం చేయాలని తొర్రూరు జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తక్షణమే రూ.2లక్షల రుణ మాఫీ, వరి పంటకు క్వింటాకు మద్దతు ధర కంటే అదనంగా బోనస్ రూ.500, పంట నష్టపోయిన వివరాలు సేకరించి ఎకరాకు రూ.25వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కౌలు రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 6న ఉదయం 9 గంటలకు రాజీవ్ చౌరస్తాలో ధర్నా ఉంటుందని, ఈ ధర్నాకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాజరవుతారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఆర్ఎంపీ వైద్యుడికి నివాళి

కేసముద్రం, ఏప్రిల్ 5 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అర్వపల్లి గణేష్(43) అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ఆయన మృతదేహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, మండల మాజీ అధ్యక్షుడు జాటోత్ హరీష్‌నాయక్, కాంగ్రెస్ నాయకుడు తరాల వీరేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అటవీశాఖ అధికారిపై దాడి హేయనీయం

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 5:అడవులను పరిరక్షిస్తున్న అటవీశాఖ అధికారులపై దాడి చేయడం హేయనీయమైన చర్య అని జూనియర్ ఫారెస్టు అధికారుల అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సాంబునాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రేంజ్‌పరిధి ముల్కలపల్లి ఏజెన్సీలో అటవీ శాఖ అధికారిపై పోడు రైతులు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అడవుల సంరక్షణ కోసం ప్రాణాలను లెక్క చేయకుండా అటవీ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తుంటే వారిపై దాడి చేయడం సరైంది కాదన్నారు. అధికారులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో విష్ణు, సీహెచ్, విక్రమ్‌కుమార్, బి.రమేష్, ఏ. కవిత, బి. సత్యం పాల్గొన్నారు.

నేషనల్ ఉమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్‌నాయక్



మరిపెడ రూరల్, ఏప్రిల్ 5 : మండలంలోని ఎలమంచిలి తండాకు చెందిన బానోతు ప్రవీణ్‌నాయక్ నేషనల్ ఉమెన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లుగా నేషనల్ ఉమెన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షబ్బీర్ ఆలీ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌నాయక్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా గుగులోత్ మదన్‌లాల్

నెల్లికుదురు, ఏప్రిల్ 5 :బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా రత్తిరాంతండ ఎంపీటీసీ గుగులోత్ మదన్‌లాల్‌ను శుక్రవారం నియమించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుగులోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషిచేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలకు రాయితీపై వాహనాలు ఇవ్వాలి

మరిపెడ, ఏప్రిల్ 5: ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు 50 శాతం సబ్సిడీపై వాహనాలు ఇవ్వాలని జాతీయ బంజారా మిషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రమేశ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరిపెడ మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా సబ్సిడీ కలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లకు ఈ పథకం అప్పగించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయా వర్గాల సంక్షేమాన్ని విస్మరిస్తే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మరిపెడ, ఏప్రిల్ 5 : ఒంటరి మహిళనని తనను గత కొంత కాలంగా వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మరిపెడ మునిసిపల్ కేంద్రం సీతారాంపూర్ కాలనీకి చెందిన మండల భాగ్యమ్మ శుక్రవారం మరిపెడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. అనంతరం ఆమె మరిపెడ విలేకరులతో మాట్లాడారు. ఇదే కాలనీకి చెందిన బెస్త ఆదామ్ ఆయన భార్య కళావతి ఈ రోజు తెల్లవారు జామున తనపై దాడి చేశారన్నారు. పలుమార్లు చుట్టరికాన్ని అడ్డుపెట్టుకొని మానసికంగా దాడి చేస్తున్నారన్నారు. దాడి చేసిన ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె చెప్పారు. పోలీసులను వివరణ కోరగా ఆమె ఫిర్యాదుపై విచారణ జరుగుతుందని పీఎస్ రైటర్ తెలిపారు.

బద్రినారాయణకు డీఈవో పరామర్శ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5 :మహబూబాబాద్ జిల్లా ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(పీఆర్టీయూ- టీఎస్) అధ్యక్షుడు సంకా బద్రినారాయణను జిల్లా విద్యాశాఖాధికారి రామారావు పరామర్శించారు. ఇటీవల బద్రినారాయణ తండ్రి సంకా సత్యనారాయణ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న డీఈవో రామారావు శుక్రవారం మహబూబాబాద్ పట్టణంలోని బద్రినారాయణ ఇంటికి వెళ్లి సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పి ంచి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీఈవో వెంట విత్తనాల సుధాకర్ ఉన్నారు.